ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025
5
విజయనగరం



పల్లవికి బంగారు పతకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో శనపతి పల్లవికి బంగారు పతకం లభించింది. రాజస్థాన్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరపున కొండవెలగాడకు చెందిన శనపతి పల్లవి 69కిలోల విభాగంలో స్నాచ్ 90, క్లీన్ జర్క్ 110, మొత్తం 200కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించినట్లు కోచ్ చల్లా రాము తెలిపారు. ఈ సందర్భంగా పల్లవిని కోచ్, అసోసియేషన్ నాయకులు అభినందించారు.



బంగారు పతకంతో పల్లవి


ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

విద్య కాషాయీకరణను తిప్పికొట్టండి

- ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్
- ఉత్సాహంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ ప్రారంభం
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ


ఐషీ ఘోష్


రామ్మోహనరావు


బహిరంగ సభ వేదికపై అభివాదం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి విద్యను కాషాయీకరణ చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ విజయనగరం జిల్లా 33వ మహాసభ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి గురజాడ కళాభారతి ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఐషీ ఘోష్ మాట్లాడారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మనుస్మృతి అజెండాను అమలు చేస్తున్నాయని చెప్పారు. ఎన్‌ఇపి ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యారంగంలో మతభావాలను చొప్పించడంలో భాగంగా, విద్యార్థుల ఐక్యతను దెబ్బతీసే విధంగా అనేక మార్పులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి విధానాల ఫలితంగా నేడు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యారంగంలో ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులను వైస్ చాన్సలర్లుగా, ప్రిన్సిపల్స్‌గా నియమిస్తున్నారని ధ్వజమెత్తారు. కళాశాలల్లో ఎన్నికలు లేకుండా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పిపిపి మోడల్‌లో విద్యారంగాన్ని ప్రయివేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో కలుషిత నీటిని విద్యార్థులు తాగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల మరణాలకు అదే కారణమన్నారు. మంత్రులు, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటువంటి వాటిని ఎస్‌ఎఫ్‌ఐ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహనరావు మాట్లాడుతూ మాక్ అసెంబ్లీలో విద్యార్థులు అనేక సమస్యలను లేవనెత్తారని, అవన్నీ ప్రభుత్వ రంగంలో నెలకొన్నాయని స్పష్టంచేశారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు రద్దు చేశారని, రాజకీయాలు కేవలం సిఎం చంద్రబాబుకు, ఆయన కుమారుడికేనా? సామాన్యులకు అవసరం లేదా? అని ప్రశ్నించారు. రాజుల కుటుంబం నాడు ఏర్పాటు చేసిన విద్యాసంస్థలను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నేడు వ్యాపారమయం చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నెల్లిమర్ల తరలించడానికి ఎమ్మెల్యేకు సిగ్గుగా అనిపించలేదా? అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న మంత్రి నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు లేరని, కాలేజీకి భవనం లేకుండా నడుస్తుండటం దారుణమని అన్నారు.

ఉత్సాహ పూరిత వాతావరణంలో..

అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ స్థానిక లేడిస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ముందుగా ఎస్‌ఎఫ్‌ఐ జెండాను జిల్లా అధ్యక్షులు డి.రాము ఆవిష్కరించారు. అనంతరం భగత్ సింగ్, సీతారాం ఏచూరి చిత్రపటాలకు ఐషీ ఘోష్, పి.రామ్మోహనరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అమరవీరులు స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, నాయకులు శిరీషా, చినబాబు అధ్యక్ష వర్గంగా ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఇటీవల ప్రజా ఉద్యమంలో, అనేక బస్సు ప్రమాదాల్లో మరణించిన వారికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.

అనంతరం సభను ప్రారంభిస్తూ ఐషీ ఘోష్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. మహాసభలో ఎస్‌ఎఫ్‌ఐ బలోపేతం అయ్యే విధంగా నిర్ణయాలు చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు, జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐషీఘోష్


మాట్లాడుతున్న రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

ఉపాధి నిధులు మురిగిపోనివ్వొద్దు

- రోడ్లు, పాఠశాలల ప్రహరీలకు ప్రతిపాదనలు చేయాలి
- రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- సేంద్రీయ పంటల ప్రతిపాదనపై డిఆర్‌డిఎకి అభినందనలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గ్రామీణ ఉపాధిహామీ నిధులతో పాఠశాలల ప్రహరీలు, లింకు రోడ్లు, సిమ్మెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు కోరారు. నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, మురిగిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. చైర్మన్‌తోపాటు కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణి గురువారం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్లో వివిధ శాఖలకు మంజూరైన నిధులు, వినియోగం, అవసరాలపై సమీక్షించారు. వ్యవసాయం, ఉద్యానశాఖ, పశు సంవర్ధకశాఖ, మైక్రో ఇరిగేషన్, నీటిపారుదల, వైద్యారోగ్యం, విద్య, తాగునీరు, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్‌బి, డిఆర్‌డిఎ, స్త్రీశిశు సంక్షేమ తదితర శాఖలపై చర్చించారు. మహిళా పొదుపు సంఘాల అధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించి మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడానికి డిఆర్‌డిఎ చేసిన ప్రణాళికను అభినందించారు. ఈ ప్రణాళికను రాష్ట్రమంతా అమలు చేయడానికి కృషి చేస్తామని చైర్మన్ ప్రకటించారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందని, దీనిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. వరి ఉత్పాదకత పెంచాలని సబ్సిడీపై రెయిన్ గన్‌లను అందజేసేందుకు ప్రతిపాదన చేయాలని సూచించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్లను తగ్గించాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తిచేయడంపై దృష్టి పెట్టాలన్నారు. చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో, అద్దె భవనాల్లో ఉన్నాయని, సమీపంలో ఖాళీగా ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సూచించారు.

కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చాలాచోట్ల పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. ఉపాధిహామీ ద్వారా పాఠశాలల ప్రహరీలు నిర్మించాలని సూచించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ వర్షాల వల్ల వరిపంట కొంతమేర దెబ్బతిందని, నూకలు ఎక్కువగా వస్తుండటం వల్ల ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రైతు నష్టపోకుండా చూడాలని కోరారు.

కమిటీ డిప్యూటీ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా అధికారిణులు ఎక్కువగా ఉన్నప్పటికీ సమర్థవంతంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ చైర్మన్‌కు వివరించారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, సిపిఒ పి.బాలాజీ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

గంజాయి కేసులో ఐదుగురికి జైలుశిక్ష

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గతేడాది నమోదైన గంజాయి కేసులో నిందితులు బొంతు వెంకటేశ్వర రావు, మండ శాంతి, గాబు మస్తాని, బాబూ సింగ్, అలజంగి ప్రసాద్ రావుకు 18 నెలలు కఠిన కారాగార శిక్ష పడింది. దీంతోపాటు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. మీనాదేవి గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

గిరిజన విద్యాసంస్థలపై ప్రత్యేక నిఘా

గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ప్రస్తుతం 8 ఆశ్రమ పాఠశాలలు, 10 కాలేజీ హాస్టళ్లు పనిచేస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక అధికారి కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యా సంస్థల పనితీరును మరింత మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందని చెప్పారు. అందులో భాగంగా తాజా సాంకేతిక విజ్ఞానంతో రూపొందిన హాస్టల్ ఫెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టం యాప్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా హాస్టల్ నిర్వహణలో ప్రతిరోజూ జరిగే పరిశుభ్రత, పారిశుధ్యం, వంట పాత్రల శుభ్రత, ఆహార నాణ్యత, క్లాస్ రూంలు, డార్మెటరీలు, టాయిలెట్లు, బాత్రూముల పరిస్థితి, ఓవర్ హెడ్ ట్యాంకులు, మినరల్ వాటర్ ప్లాంట్ల పనితీరు వంటి అంశాల ఫొటోలను తప్పనిసరిగా అప్లోడ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న విద్యార్థుల వివరాలు, ప్రతి విద్యార్థి బ్లడ్ గ్రూప్ వంటి సమాచారాన్ని కూడా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. యాప్ అమలు వల్ల విద్యార్థుల భద్రత, మెనూ ప్రకారం భోజనం, పరిశుభ్రత, వైద్య శ్రద్ధ వంటి అంశాల్లో గణనీయమైన మెరుగుదల సాధ్యమవుతుందని వివరించారు.

సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎస్‌బిఐ సిఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన సైకిళ్లను విద్యార్థినులకు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ మహారాజా సంస్కృత పాఠశాలలో చదువుతూ, సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే 16 మంది విద్యార్థినులకు గుర్తించి, వీటిని గురువారం అందజేశారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై ఈ సందర్భంగా ఎస్‌పి అవగాహన కల్పించారు. ఇంటర్‌నెట్‌ను దుర్వినియోగం చేస్తూ, అనవసర విషయాలకు ప్రాధాన్యత కల్పిస్తూ, సోషల్ మీడియా, రీల్స్ అంటూ సమయాన్ని వృథా చేస్తే, భవిష్యత్తులో బాధపడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్‌బాబు, ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిఇఒ కె.వెంకటరమణ, ఎస్‌బిఐ జోనల్ సెక్రటరీ ఎం.రమేష్ కుమార్, ఎస్‌బిఐ హెచ్‌ఆర్ మేనేజరు పి.ఎన్.చారి, పాఠశాల హెచ్.ఎం. టి.లలిత కుమారి, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

అలరించిన నృత్య ప్రదర్శన

టెలిస్కోప్‌తో చంద్రుడిని ముద్దాడిన పిల్లలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం పుస్తక మహోత్సవంలో భాగంగా మూడోరోజు గురువారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక స్టేట్ బ్యాంక్ అధికారి కుమార్తె మనస్వి చేసిన భారత్ నాట్యం అలరించింది. అదేవిధంగా దీపాంసిక, సితార, హర్షిణి చేసిన నృత్య ప్రదర్శన పలువుర్ని ఆకర్షించింది. సాహితీ కార్యక్రమంలో భాగంగా వర్ధమాన రచయిత మల్లిపురం జగదీష్ రచించిన మన్యం ముచ్చట్లు పుస్తకం గురించి ఉపాధ్యాయుడు, చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు విశ్లేషణ చేశారు. కళింగాంధ్ర గిరిజన సాహిత్యం గురించి పొందూరు సుధాకుమార్ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. సాహితీ, సాంస్కృతిక కార్యక్రమానికి గంటేడ చిన్నం నాయుడు అధ్యక్షత వహించారు. కవి, రచయిత గంటేడ గౌరునాయుడు, నిర్వాహక కమిటీ సభ్యులు ఎస్.మురళీమోహన్, కె.భాస్కరరావు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న టెలిస్కోప్

పుస్తక మహోత్సవంలో భాగంగా శుక్రవారం వైజాగ్ ఆస్ట్రానమీ క్లబ్ సభ్యులు నిర్వహించిన టెలిస్కోప్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. టెలీస్కోప్‌లో చంద్రుడ్ని ముద్దాడిన చందంగా తిలకించిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఎక్కువ గా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


టెలిస్కోప్ ద్వారా చంద్రుడిని చూస్తున్న విద్యార్థులు

నేడు వెయ్యి మందితో 'పాడుదుమా స్వేచ్ఛా గీతం'

ఉత్తరాంధ్రకు గర్వకారణమైన ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు రచించిన "పాడుదమా స్వేచ్ఛా గీతం" దేశభక్తిని రగిలించే గీతాన్ని శుక్రవారం వేయిమంది విద్యార్థులు ఒకేసారి ఆలాపన చేయనున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర పాఠశాలల్లో తొమ్మిదో తరగతి తెలుగు వాచకం కుమార భారతిలో ఈ గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చిన గౌరవం దక్కింది. ఏలూరులో జరిగిన బాలోత్సవంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు సామూహికంగా ఆలపించగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యింది. దేశవ్యాప్తంగా పేరు సంపాదించిన ఈ గీతం పుట్టినిల్లు పార్వతీపురం కావడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణం. శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న మన్యం పుస్తక మహోత్సవ వేదికపై వెయ్యిమంది విద్యార్థినీ విద్యార్థులతో ఈ గీతాన్ని మరోసారి సామూహికంగా గానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.


ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్మికులు

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. సుందరయ్య సస్పెన్షన్‌ను రద్దుచేసి, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గురువారం స్థానిక ఆర్‌టిసి డిపో ఎదుట ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకట్రావు, వి.రాములు మాట్లాడుతూ ఏలూరు డిపోలో ఆర్‌టిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్ బంకులో అవకతవకలు జరిగాయన్నారు. ఆయిల్ బంక్ నిర్వహణలో, అందులో జరిగిన అవకతవకల్లో ఎటువంటి సంబంధమూ లేని ఏలూరు డిపోలో ఒపిటిఒ కార్యాలయంలో ఫైనాన్స్ సెక్షన్లో పనిచేస్తున్న సిహెచ్ సుందరయ్యను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపించి, అసలైన దోషులను గుర్తించి, శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె రఫీ, ఎ.చంద్రయ్య, కెఆర్ లక్ష్మి, బి.లక్ష్మి, ఎన్.శారద, డి.ఎస్.రావు, పి రాంకీ పాల్గొన్నారు.


జెసి సేధుమాధవన్‌ను కలిసిన జిల్లా సైనిక సంక్షేమాధికారి కృష్ణారావు

జిల్లా సైనిక సంక్షేమాధికారిగా కృష్ణారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమాధికారిగా మజ్జి కృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇంతకుముందు కూడా జిల్లాలో సైనిక సంక్షేమాధికారిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటివరకు ఇక్కడ సైనిక సంక్షేమాధికారిగా పనిచేసిన కెవిఎస్ ప్రసాదరావు పశ్చిమగోదావరి జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలను స్వీకరించిన కృష్ణారావు... జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్‌ను, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలను స్వీకరించిన కృష్ణారావును పలువురు మాజీ సైనికులు, వీరనారీమణులు, సంక్షేమ సంఘం నాయకులు, సిబ్బంది అభినందించారు.

అక్రమ నిర్మాణాలపై ఉపేక్షించేది లేదు

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిబంధనలు అతిక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. గురువారం ప్రణాళిక సిబ్బంది స్థానిక కె.ఎల్.పురంలోని గంజిపేట వద్ద అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న షెడ్డును తొలగించారు. నిర్మాణంలో ఉన్న షెడ్డు సామగ్రిని అక్కడి నుండి తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చాలాసార్లు అనేక రూపాలలో ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కొంతమంది ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఇది ఎంత మాత్రమూ క్షమించరానిదని చెప్పారు.

ఘనంగా స్పార్క్ సంస్థ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్పార్క్ సొసైటీ 19వ వార్షికోత్సవం సందర్భంగా పూల్‌బాగ్ కాలనీలోని శ్రీ వ్యాస నారాయణ స్వామి ఆలయ దేవస్థానం ప్రాంగణంలో గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించింది. ఉత్తమ సేవలు అందించినందుకు గాను బాస్ (బ్రదర్ ఆఫ్ సోషల్ సర్వీసు) అవార్డును బొబ్బిలికి చెందిన కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జెసి రాజుకు శ్రవణ స్వామి ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్పార్క్ సొసైటీ అధ్యక్షులు భవాని పద్మనాభం, ఉపఖజానాధికారి పివి పద్మనాభం పాల్గొన్నారు.

కార్యదర్శులదే కీలకపాత్ర

విజయనగరం టౌన్ : పరిసరాల పరిశుభ్రత పాటించడంలో వార్డు కార్యదర్శుల పాత్ర చాలా కీలకమని అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మూడో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సెక్రటరీ నిబద్ధతతో పనిచేసే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయాలైన స్వచ్ఛభారత్ కార్యక్రమాలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ ఆపాలి

నెల్లిమర్ల: మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలని మాజీ ఎమ్మెల్యే వైసిపి నియోజకవర్గం ఇంచార్జి బడ్డుకొండ అప్పలనాయుడు డిమాండ్ చేశారు. గురువారం కొండవెలగాడలో మెడికల్ కళాశాల ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ వల్ల పేద ప్రజలకు వైద్యం దూరమవుతుందన్నారు. ముఖ్యంగా మెడికల్ కళాశాలలు ప్రభుత్వము నడపడం వల్ల ఉచిత వైద్య విద్యతో పాటు పేద ప్రజలకు ఉచిత వైద్యం కూడా అందించడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 19వ విడత సామాజిక తనిఖీపై గురువారం సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సి హెచ్ సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటికి ప్రాధాన్యత

నెల్లిమర్ల: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ కె.రామకృష్ణ రాజు సూచించారు. గురువారం ఆయన మదుపాడ, బొప్పడాం గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం, తాగునీటి సరఫరా, సంపద సృష్టి కేంద్రాలు, సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యర్థాలను సంపద సృష్టి కేంద్రాలకు తరలించి విధిగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

బాల్య వివాహాలపై అవగాహన

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ ఎన్ఎవిఎస్ లక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అన్ని హెల్త్ వెల్నెస్ సెంటర్స్ యంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు బాల్య వివాహాలపై అవగాహన కల్పించినట్లు పిహెచ్ ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, ఎఎన్ఎం లక్ష్మీ ఆశ వర్కర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మహిళ తరలింపు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర గ్రామంలో ఒడిస్సాకు చెందిన ఒక మహిళ ఆరు సంవత్సరాల నుండి భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై ఎడమ కాలుకు బలమైన దెబ్బలు తగలడంతో నడవలేని పరిస్థితిలో ఉంది. దీనిని గమనించిన ప్రజలు, బిగ్ టీవీ ఛానల్ రిపోర్టర్ నాయుడు, సతీష్, భార్గవ్, రమేష్, బొడ్డవర పంచాయతీ సెక్రెటరీ బంగారునాయుడు, కాండ్రెగుల ఈశ్వరరావు, గజిట్ల తదితరులు రెడ్ క్రాస్ సిబ్బందికి గురువారం సమాచారం అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బాల సతీష్ ఆదేశాల మేరకు వారు ఆమెను అక్కడ నుంచి పెందుర్తిలో ఉన్న 'అమ్మాలా' వృద్ధాశ్రమానికి తరలించారు.

పారాది వంతెన వద్ద స్తంభించిన ట్రాఫిక్

బొబ్బిలి: పారాది వంతెన వద్ద గురువారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. వంతెనపై ఎదురుదురుగా రెండు వాహనాలు వచ్చి వంతెన మధ్యలో ఉండిపోయాయి. దీంతో ట్రాఫిక్ ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరాయి. అర గంటకుపైగా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రేపు కాంగ్రెస్ సమావేశం

శృంగవరపుకోట: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గేదెల తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో ఎఐసిసి పరిశీలకులు రఘువేంద్ర దాసు, ఎపిసిసి పరిశీలకులు బొడ్డు శ్రీను, జివి.శ్రీనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎస్ఐ జె.లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమింగ్, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచి సత్ప్రవర్తనతో మెలిగి మంచి మార్గంలో నడవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలతో రైతుల్లో కలవరం

వేపాడ: తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే చాలా మంది రైతులు వరిచేలు కోసి పొలాల్లోనే ఉంచారు. మరి కొంత మంది కోతకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో తుపాను హెచ్చరికలు వారిని కలవరపెడుతున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో తుపాను వల్ల వర్షాలు పడితే పంట మొత్తం వర్షార్పణం అయిపోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలా అని సమయం మించిపోయిన తరువాత వరికోతలు కోస్తే ధాన్యం పొలంలోనే రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు సమయం అయిపోయిందని కోతలు ప్రారంభిస్తే తుపానుకు దొరికి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంతో పాటు ఆనందపురం, సోంపురం, ఆకుల సీతంపేట, వేపాడ, వల్లంపూడి ఎస్‌కెఆర్‌పురం, గుడివాడ రైతులు తుపాను వస్తే ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దత్తిరాజేరు: మండలంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామ సమైక్య సభ్యుల ద్వారా రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని వెలుగు ఎపిఎం రమణ అన్నారు. దత్తి, రాజుల రామచంద్రపురం, షికారుగంజి, పాచలవలస గ్రామాల్లో గ్రామ సమైక్య సభ్యులు, టిడిపి నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. రైతులు అమ్మదలిచిన ధాన్యాన్ని దగ్గర రైతు సేవా కేంద్రాల వద్ద మహిళా సంఘాలు ఆధ్వర్యంలో డేటా ఆపరేటర్ దగ్గర రైతు పేరు ఆధార్ కార్డు నంబర్ ట్రక్ సీట్ నెంబర్ కొట్టించి నచ్చిన మిల్లులకు పంపించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సమైక్య అధ్యక్షులు, సీసీలు, విఒఎలు, టిఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు సరిపోల్చాలి

విజయనగరంటౌన్: ఓటర్ల వివరాలను సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య.. బిఎల్ఒలను ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ద్వారా ఓటర్ల వివరాలు సరిపోల్చే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా ఓటర్ల వివరాలు సరిపోల్చాలన్నారు. విజయనగరం నియోజకవర్గం ఈ విధానం అమలులో వెనుకబడి ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.

అపరాల సాగుపై అవగాహన

విజయనగరంకోట: మండలంలోని జొన్నవలస గ్రామంలో ఆర్‌బికె హేమసుందర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో అపరాలు, ఇతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అపరాలతో పాటు మిగతా జీవవైవిధ్య పంటలను వేసే భూమి సారవంతం కావడంతోపాటు అదనంగా ఆదాయం కూడా పొందవచ్చని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

బొబ్బిలి : బొబ్బిలి నుంచి మెరకముడిదాం మండలం గర్భాం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిఎస్‌డిటి ఆర్.సాయికృష్ణ గురువారం సీజ్ చేశారు. వ్యాన్‌తో రేషన్ బియ్యం తరలిస్తుండగా జె.రంగరాయపురం వద్ద సిపిఎం నాయకులు సురేష్ చూసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిఎస్‌డిటి, విఆర్ఒ చేరుకుని వ్యాన్‌తో బియ్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

22 మందిపై బైండోవర్

సంతకవిటి: అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టి రాజాం ఎక్సైజ్ శాఖ అధ్యర్యంలో గతంలో పట్టుబడిన 22 మందిపై బైండోవర్ చేశారు. ఇందులో బెల్ట్ షాపుల కేసుల్లో పూర్తుగా పట్టుబడిన 5 మంది, నేరప్రవృత్తి ఉన్నట్లు గుర్తించిన మరో 17 మంది ఉన్నారు. వీరిని గురువారం తహశీల్దార్ బి.సుదర్శన్ రావు ఎదుట హాజరుపరిచి, ఒక్కొక్కరికి రూ.1 లక్ష పూచీకత్తుతో ఒక ఏడాది బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమ మద్యం విక్రయాలపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ జైభీమ్ హెచ్చరించారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషిచేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని ఎపి మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. గురువారం నగర పంచాయతీ పరిధిలో పోలీసులు, విద్యార్థుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తును కాపాడే దిశగా ప్రతి కుటుంబానికి, ప్రతి విద్యాసంస్థకు అవగాహన కలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థుల్లో సానుకూల ఆలోచనలు, లక్ష్య సాధనపై దృష్టి, క్రీడా-సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత పెరిగితే డ్రగ్స్ వైపు వెళ్లే అవకాశాలు తగ్గుతాయని అన్నారు. కార్యక్రమంలో సిఐ రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, టౌన్ పార్టీ అధ్యక్షుడు లెంక అప్పలనాయుడు, నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, రెడ్డి వేణు, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, పోలీసులు, విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ర్యాలీని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు బంగార్రాజు, రవిశేఖర్

డ్రగ్స్ మహమ్మారితో యువత భవిష్యత్ అంధకారం: డిఎస్‌పి

బొండపల్లి: డ్రగ్స్ మహమ్మారితో యువత భవిష్యత్ అంధకారంగా మారుతుందని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని గొట్లాం శ్రీగాయత్రి కళాశాల ఆవరణంలో బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ అధ్యక్షతన అభ్యుదయం సైకిల్ యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయికి యువత అలవాటు పడడం వల్ల శరీరంలోని ప్రతి అవయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం ఇంచార్జ్ సి.ఐ నారాయణరావు, ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు, ఎఎంసీ చైర్మన్ గోపాలరాజు, వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, తహశీల్దారు డి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ గిరిబాల, కళాశాల కరస్పాండెంటు జగదీశ్వరి, టిడిపి మండల అద్యక్షుడు రాపాక అచ్చుం నాయుడు, కళాశాల ఎఒ రాఘవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం భూ సమస్యపై చర్చిస్తారా?

ప్రజాశక్తి - జామి

స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. గ్రామ సర్పంచులు, మండల పరిషత్ పాలక వర్గం పదవుల గడువు దగ్గర పడుతోంది. ఈ తరుణంలో శుక్రవారం జరుగుతున్న జామి మండల సర్వసభ్య సమావేశానికి ప్రత్యేకత సంతరించుకుంది. ఇప్పటికే జామి గ్రామానికి సంబంధించిన పలు కీలక సమస్యలు పరిస్కారం చేసినప్పటికీ, ఇంకా అనేక కీలక సమస్యలతో రైతాంగం, ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు.

జామి గ్రామంలో ప్రధాన సమస్యల్లో ఒకటైన జామి రోజూవారి మార్కెట్ సమస్యను జిల్లా పరిషత్ నిధులతో సాయంతో ప్రస్తుత పాలక వర్గం హయాంలోనే పరిష్కారం చేసిన విషయం తెలిసిందే. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యలను కొంత వరకు ఆదిగమించారు. లొట్లపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో సామూహిక భవనాలు నిర్మించుకున్నారు. కానీ దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న జామి అగ్రహారం భూ సమస్య నేటికీ పరిస్కారానికి నోచుకోలేదు. జామి శ్మశానం సమస్య, అపారిశుధ్యంతో నిండి పోయిన, జాగారం - అన్నంరాజుపేట సాగునీటి కాలువ దుర్వాశన జామి గ్రామ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. మరి కొద్ది నెలల్లో మండల పరిషత్ పాలక వర్గం పదవులు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో జామి అగ్రహారం భూ సమస్య, షాఫింగ్ కాంప్లెక్స్ పైన కీలక తీర్మానం చేస్తే, రాబోయే నూతన పాలకవర్గానికి దాని ప్రాధాన్యత తెలియజేసినట్లు అవుతుందన్న చర్చ లేకపోలేదు. ఇక గ్రామాల్లో సమస్యలు, కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలు ఎలాగోనూ, ఉన్నాయి. వీటన్నింటి పైన సమగ్ర చర్చ జరగాలని ప్రజల బావిస్తున్నారు. పాలక పక్షంలో అత్యధిక సభ్యులు ప్రతి పక్ష పార్టీ వాళ్ళే ఉన్నప్పటికీ కూటమి పాలనలో అధికార యంత్రంగం ఉంది. ప్రజా సమస్యల ప్రాధాన్యతను అధికార యంత్రాంగం ముందు ఉంచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరగబోయే సర్వసభ్య సమావేశంలో లోతైనా చర్చ జరగాలని వాదన వినిపిస్తోంది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు

ప్రజాశక్తి- డెంకాడ

రైతులందరూ సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం విజయనగరం ఆధ్వర్యంలో విజయనగరం ఆత్మ సహకారంతో రబీ పంటలలో కీలక యాజమాన్య పద్ధతులు అంశంపై రైతులు శాస్త్రవేత్తలు సత్యాగోష్ఠి కార్యక్రమాన్ని మండలం కేంద్రంలోని కెవి సూర్యనారాయణ రాజు పొలంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యవసాయం చేయడంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లాభదాయకమైన పంటల సరళి, ప్రస్తుతం పండిస్తున్న పంటలకు ఎటువంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నారని అడిగారు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నైరా వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ జి జోగినాయుడు మాట్లాడుతూ రైతులకు వివిధ సాంకేతిక యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం మహాత్మ పథక సంచాలకులు అనురాధ, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ కె.లక్ష్మణ్, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ పాత్ర, ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్, ఎఒ సంగీత, ఏరువాక కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు, వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పంచాయతీ నిధులు దుర్వినియోగం!

◆సర్పంచ్ స్వాహా చేసినట్లు ఆరోపణలు ◆డిపిఒకు ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబాడ వెంకటాపురం గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్లు మాజీ సర్పంచ్ గోగుల తమ్మి నాయుడు, ప్రస్తుత గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పి రమాదేవి, బి. జ్యోతితో పాటు పలువురు సంతకాలు చేసి విజయనగరంలో డిపిఒకు గురువారం ఫిర్యాదు చేశారు. గత ఐదేళ్లుగా ప్రస్తుత గ్రామ సర్పంచ్ చుక్కా వెంకటినాయుడు పంచాయతీ అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. 15 ఆర్థిక సంఘం నిధులతో పాటు జనరల్ ఫండ్ నిధులు పనులు చేయకుండా బిల్లులు చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. సిసి రోడ్లు, కల్వర్టులు, గ్రావెల్ రోడ్లు తదితర ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి పనులు చేయకుండా బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. కొన్ని చేసిన పనులకు నాణ్యత ప్రమాణాలు లేకుండా ఉన్నాయని అవి శిథిలమైపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలానికి చెత్త సంపద సృష్టి కేంద్రాలకు సంబంధించి గత ప్రభుత్వం వాహనం మంజూరు చేసిందని, స్వచ్ఛ దూతుల పేరుతో నెలవారి 20 నుంచి 25 వేల వరకు పంచాయతీ నిధులు డ్రా చేసి కేవలం స్వచ్ఛ దూతుకు పదివేల రూపాయలు మాత్రమే అందజేశారని చెప్పారు. మూడు నెలలకు జరిగే గ్రామపంచాయతీ అభివృద్ధి గ్రామ సభలకు సంబంధించి వార్డు సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి తన ఇష్టానుసారంగా వ్యవహరించి పనులకు సంబంధించి తీర్మానాలు చేసుకున్నారని ఆరోపించారు. దీనికి తోడు రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ సంబంధించి అన్నీ తాము చేస్తామని ప్రజలకు హామీ ఇస్తూ వారి వద్ద లంచాలు తీసుకునే పరిస్థితి ఉందని అన్నారు. గత ఐదేళ్లుగా గ్రామ సచివాలయం కాంట్రాక్టర్‌గా ఉండి, ఇంతవరకు సచివాలయం పూర్తి చేయకపోవడం నిధులు స్వాహా చేయడం వంటివి జరిగాయని లేఖలో పేర్కొన్నారు. సర్పంచ్‌పై విచారణ జరిపి రికవరీ చేయాలని కోరారు. గ్రామంలో ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో సర్పంచ్ పై, ప్రభుత్వ నుంచి వచ్చిన అభివృద్ధి పథకాలకు సంబంధించి పనులను విచారణ చేపట్టి రికవరీ చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను కోరారు.



అంబాడ వెంకటరావు పంచాయతీ కార్యాలయం

కార్యదర్శిగా ఏడాది నుంచి పనిచేస్తున్నాను

అంబాడ వెంకటాపురంలో గత ఏడాది నవంబర్‌లో పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. అంతకుముందు ఏం జరిగిందో తెలియదు. ఇటీవల ఆడిట్ కూడా నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నాను.

శ్యామ్, పంచాయతీ కార్యదర్శి, అంబాడ వెంకటాపురం

మామిడి సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో సోమలింగాపురం యూనిట్ పరిధి గ్రామాలైన కొర్లాం, మెరకముడిదాంలో డిపిఎం ఆనందరావు ఆధ్వర్యంలో మామిడి రైతులకు సస్యరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలకు యూరియా, పొటాషియం, బాస్వరం వాడకూడదని, మామిడి దిగుబడి కోసం కల్తర్ వేయకూడదని అన్నారు. మామిడి తోటలకు పలు పత్ర ద్రావణం, పుల్లట మజ్జిగ కొట్టాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ శంకర్, యూనిట్ ఇంచార్జ్ కళావతి, ఐసిఆర్‌పి పరమేష్, సాయి రమేష్, వెంకటేష్, నర్సమ్మూర్తి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని పక్కి గ్రామంలో మామిడి పంటపై రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రస్తకుంటబాయి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు మాట్లాడుతూ మామిడిలో ఎరువులు, నీటి యాజమాన్యం, పూత, పిందె సమయంలో తెగుళ్ళ, చీడ పీడల నివారణ గురించి తెలియజేశారు. నిమ్మకాయ సైజ్‌లో ఉండేటప్పుడు పండ్ల తొడిమలను కట్టినట్లయితే పండు ఈగ, గుడ్డ పుచ్చు పురుగు, బూడిద తెగులు సమర్థవంతంగా అరికట్టవచ్చును అని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవ ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.వెంకటరత్నం గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: మాట్లాడుతున్న డిపిఎం ఆనందరావు

'మా భూమి మా పేరిట నమోదు చేయండి'

ప్రజాశక్తి- పూసపాటిరేగ

'మాకు తెలియకుండా మా నానమ్మ పేరున ఉన్న భూమిని మా చిన్నాన్న పేరుమీద ఆన్‌లైన్‌లో మార్చేశారు' అని మండలంలోని కోనాడ గ్రామానికి చెందిన బసవ అప్పలనరసమ్మ గురువారం తహశీల్దార్ కల్యాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పలనరసమ్మ మాట్లాడుతూ తన తల్లి కంబపు అప్పలనర్సమ్మ పేరుతో ఉన్న భూమిని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, తన చిన్నాన్న కంబపు అప్పలరెడ్డి పేరుమీద ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. తన తండ్రి వాటా ప్రకారం భూమిని తన తమ్ముడికి, తనకు పంచాలని, కానీ కుటుంబ ధృవీకరణ పత్రంలో తమ పేర్లు చేర్చకుండా, నేరుగా భూమి రికార్డులను మార్చేసి అన్యాయం చేశారని తహశీల్దార్ ముందు వాపోయారు. కుటుంబ ధృవీకరణ పత్రాలు లేకుండా భూమి ఆన్‌లైన్‌లో ఎలా మారుస్తున్నారని ప్రశ్నించారు. ఇందులో ఎలాంటి అక్రమాలు జరిగాయో విచారణ జరిపి, చట్ట ప్రకారం తనకు రావలసిన వాటా భూమిని తిరిగి తన పేరున ఆన్‌లైన్ చేయాలని కోరారు. వినతి సమర్పించిన వారిలో మాజీ సర్పంచ్ దంగా భూలోక, బసవ అచ్చిబాబు తదితరులు ఉన్నారు.



వినతిపత్రాన్ని అందిస్తున్న బాధితురాలు

శాస్త్రీయ సమాచారంతో కుటుంబాలు శక్తివంతం

ప్రజాశక్తి- రాజాం

శాస్త్రీయ సమాచారం సమాజానికి చేరితే కుటుంబాలు శక్తిమంతం అవుతాయని, భయాలు, అపోహలు తొలగి ఆరోగ్యకరమైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని ఎఎంసి చైర్మన్, జెసి క్లబ్ సెక్రటరీ గురువాన నారాయణరావు అన్నారు. వంధ్యత్వం పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు రాజాంలో ఓయాసిస్ జననీ యాత్ర గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెర్టిలిటీ అవగాహనను కుటుంబాలకు దగ్గర చేస్తూ, సమాజ స్థాయి ఆరోగ్య చైతన్యాన్ని బలోపేతం చేస్తున్న ఓయాసిస్ ఫెర్టిలిటీ ప్రయత్నాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓయాసిస్ ఫెర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు, ఓయాసిస్ ఫెర్టిలిటీ ప్రతినిధి పుష్కరాజ్ షెనాయ్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలను రైతులు పండించాలి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

పామాయిల్ తోటలపై రైతులు దృష్టి సారించాలని ఎడిఎ భారతి అన్నారు. గురువారం దాసరిపేట, మరడాం, దత్తి, టి.బూర్జువలస గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి పద్ధతిలు పాటించాలని, రబీలో ఎక్కువ చోడిపంట పండించాలని ఉద్యాన పంటలైన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం పెంచాలని ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని రేజారు, గొల్లాది గ్రామంలో ఎఒ సూర్య ప్రకాష్ ఆధ్వర్యాన రైతన్నా మీకోసం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి రైతులకు వచ్చే రబీ, ఖరీఫ్‌పై అవగాహన కల్పించారు. తహశీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రంలో రైతులు పాల్గొన్నారు.



బాడంగి: రైతులతో మాట్లాడుతున్న అధికారులు

24 గంటల్లోనే రైతులకు డబ్బులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తహశీల్దార్ డి.ధర్మరాజు తెలిపారు. గురువారం స్థానిక ప్రజాశక్తి విలేకరితో ఆయన మాట్లాడారు. మండలంలో 8,800 ఎకరాలలో వరి పంట పండిందన్నారు. పంటకు సంబంధించి సుమారు 20,295 మెట్రిక్ టన్నుల ధాన్యం పంట వస్తుందని, ఇందులో 4వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతులు వాడకానికి పోగా మిగిలిన 16,295 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉందని అన్నారు. ధాన్యం సేకరించేందుకు ఇప్పటికే మండలంలో 11 కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈ కేంద్రాల ద్వారా మండలంలో ఉన్న పది రైస్ మిల్లులకు ధాన్యాన్ని అందించనున్నామని చెప్పారు. ఇప్పటికే 112 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని షెడ్యూల్ చేశామన్నారు. దొడ్డి రకం దాన్యానికి సంబంధించి క్వింటాకు 2,369 రూపాయలు, సన్నాల రకం ధాన్యానికి 2,389 రూపాయలుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులు రైతుసేవా కేంద్రాలకు గాని, పిఎసిఎస్‌లకు గాని ఇచ్చిన ధాన్యంలో 17శాతం తేమ దాటకుండా ఉండాలని సూచించారు

డ్వాక్రా రుణాలతో జీవనోపాధులు పెంచుకోవాలి


ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలతో జీవనోపాదులు పెంచుకోవాలని వెలుగు డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో ఆదర్శవంతమైన మండల సమాఖ్యలకు సంబంధించి వార్షిక కార్యాచరణ ప్రణాళిక జిల్లా స్థాయి శిక్షణ రెండవ రోజు కొత్తపేట గ్రామ సంఘంతో నిర్వహించారు. ఈ శిక్షణకు కొత్తపేట కార్యవర్గ సభ్యులతో పాటు మోడల్ మండలాలు బొబ్బిలి, బొండపల్లి, ఎస్.కోట, ఎల్.కోట, రాజాం, సంతకవిటి, చీపురుపల్లి, గరివిడి సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ చిరంజీవి మాట్లాడుతూ సంఘ సభ్యులు తీసుకున్న రుణాలతో సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకొని స్వయం సంవృద్ధి సాధించాలన్నారు. ఈ శిక్షణలో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తులు సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాధులు, సామార్థ్యల పెంపు విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంతో పాటు ఎపిఎం పద్మ, సురేష్, సింహాచలం, భవాని, అప్పలనాయుడు, కుమార్, భాగ్యలక్ష్మి, సీసీలు, విఒఎలు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

ప్రజాశక్తి - సంతకవిటి

ధాన్యం తరలింపులో జాప్యం వద్దని తహశీల్దార్ బి. సుదర్శనరావు అన్నారు. మండలంలోని పొనుగుటివలసలో ఉన్న రైస్ మిల్లును ఆయన గురువారం పరిశీలించారు. రైతులు విక్రయ కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం ఎటువంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, సమయానికి మిల్లులకు తరలించేందుకు సంబంధిత శాఖలు సమన్వయం పాటించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు వంటి పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం తరలింపులో ఎటువంటి అవినీతి చోటుచేసుకోకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలపరచాలని సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేందుకు కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సిబి యశ్వంత్ రావు, విఆర్ఒ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహశీల్దార్